





ప్రగతి పరుగులు..

కోడుమూరు మండలం వైనదొడ్డి గ్రామ రహదారి

వైసీపీ అరాచక పాలనకు ప్రజలు స్వస్తి చెప్పి.. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజాపాలనకు పట్టంకట్టి నేటికి ఏడాది పూర్తవుతుంది. ఈ ఏడాది కాలంలో కర్నూలు జిల్లాలో ప్రగతి.. సంక్షేమం జోడెద్దుల్లా పరుగులు పెడుతున్నాయనే చెప్పాలి. గ్రామీణ రోడ్లకు 'పల్లె పండుగ' రావడంతో అందంగా మెరిసిపోతున్నాయి. రాయలసీమ జీవనాడి హంద్రీ నీవా విస్తరణకు రూ.3,800 కోట్లతో శ్రీకారం చుట్టారు. కర్నూలు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతికి బలమైన పునాదులు పడ్డాయి. 'మార్గదర్శి-బంగారు కుటుంబం' (పీ-4) లో పేదలను ధనికులను చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు దిశగా అడుగులు పడుతున్నాయి. కరువు-వలసల నివారణ లక్ష్యంగా చేపట్టిన వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు చేపట్టాలి. టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలి. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి. రాబోయే నాలుగేళ్లలో ఆ దిశగా అడుగులు పడాలి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నేటితో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలో జరిగిన అభివృద్ధి, రాబోయే నాలుగేళ్లలో చేపట్టాల్సిన ప్రగతి పనులపై 'ఆంధ్రజ్యోతి' విశ్లేషణాత్మక కథనం.

- రూ.3,800 కోట్లతో హంద్రీ నీవా విస్తరణ
- ఓర్వకల్లు కేంద్రంగా ఇండస్ట్రియల్ కారిడార్
- రహదారులు పురోభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- స్మార్ట్‌సిటీ దిశగా కర్నూలు పరుగులు
- హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు
- సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలోని ప్రజాపాలనకు ఏడాది పూర్తి

కర్నూలు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో కందనవోలులో ప్రగతి పరుగులు పెడుతోంది. జిల్లాలో ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. వివిధ పరిశ్రమలు ఏర్పాటుద్వారా రూ.12వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎస్ గ్రూపులు సంయుక్తంగా దాదాపు రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను 130ఎకరాల్లో స్థాపించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 1200 ఎకరాల్లో రూ.13వేల కోట్లతో 'ఈవీ పార్క్'కు ఒప్పందం, 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటుచేయబోతున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో రూ.16,500కోట్లు పెట్టుబడులు, 12-13వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు 7సోలార్, విండ్ ప్రాజెక్టుల ఒప్పందం చేసుకున్నాయి. పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద 97.24 ఎకరాలో మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు.

రహదారులకు కొత్త కళ..

వైసీపీ హయాంలో ప్రజలు గుంతలమయమైన రోడ్లతో అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్ర, జిల్లా, గ్రామీణ రోడ్ల అభివృద్ధి, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో ఏడాదిలో 17 9రహదారుల పనులకు రూ.91.50 కోట్లు మంజూరు చేశారు. సగానికిపైగా పనులు పూర్తి కాగా.. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గుంతల రోడ్లు అందంగా మారాయి. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పల్లె పండుగ, నాబార్డు కింద 1,388 పనులకు రూ.185.45 కోట్లు మంజూరు కాగా.. 961 పనులు పూర్తిచేసి 77.78 కోట్లు ఖర్చు చేశారు. వివిధ దశల్లో ఉన్న 414 పనుల కోసం రూ.40.54 కోట్లు వెచ్చించారు. రూ.17.13 కోట్లతో చేపట్టే 13 పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలో రోడ్లు పురోగతి వైపు పరుగులు పెడుతున్నాయి.



మద్దికెర - బురుజుల ప్రధాన రోడ్డు



పారిశ్రామిక ప్రగతికి పెద్ద పీట

జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తున్నాం. ఏడాదిలో రాష్ట్రంలో రూ.9.30 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం. ఈ ప్రాజెక్టుల పనులు పూర్తయితే 5,70,434 ఉద్యోగాలు వస్తాయని వివరించారు. 2029 నాటికి యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం ఇవ్వడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. జిల్లాలో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేస్తే సెమీ కండక్టర్ వంటి పలు పరిశ్రమలు వస్తాయి. కర్నూలు స్మార్ట్‌సిటీ అభివృద్ధి కోసం ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థతో డీపీఆర్ తయారు చేయిస్తున్నాం. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది.

● టీజీ భరత్,
రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, కర్నూలు



పంట కాలువలకు మహర్దశ..

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి ఎన్నికలు నిర్వహించింది. పంట కాలువల మరమ్మతులు, అభివృద్ధికి పెద్దపీట వేశారు. కేసీ కాలువ, టీబీపీ ఎల్లెల్సీ, జీడీపీ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్వహణ, అత్యవసర మరమ్మతులు 259 పనులకు ఓఅండ్ఎం నిధులు రూ.2116కోట్లు మంజూరు చేశారు.

హంద్రీనీవా విస్తరణ: ఉమ్మడి జిల్లాలో రూ.690 కోట్లతో హంద్రీనీవా విస్తరణ చేపట్టారు. పనులు పరుగులు పెడుతున్నాయి. జూలై 10 తరువాత 3,860 క్యూసెక్కులు కృష్ణా జలాలు తీసుకోవాలని లక్ష్యం. కరువు రైతులకు పెద్ద ఊరట ఇది.

హైకోర్టు బెంచ్‌కు చర్యలు

కర్నూలు న్యాయ రాజధాని అంటూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల మభ్యపెడితే ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, న్యాయ శాఖ అక్టోబరు 28న లేఖ నంబరు.2589691/ ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద లేఖ రాసింది. సుప్రీం కోర్టు అనుమతి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. జోహరాపురం సమీపంలో దాదాపు 48ఎకరాల్లో విస్తీర్ణం కలిగిన డంపింగ్ యార్డు ఖాళీ స్థలంలో ఐకాన్ భవనం తరహాలో నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

స్మార్ట్ సిటీగా కర్నూలు

కర్నూలు నగరం స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక తయారుచేస్తున్నారు. ఏడాదిలో నగరంలో రూ.40కోట్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం కోసం సర్వే చేస్తున్నారు. నేషనల్ హైవే నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఎస్ఏపీ క్యాంప్ మీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీకి...

పత్తికొండ నియోజకవర్గంలో దశాబ్దాలుగా టమోటా రైతులు ఎదురు చూస్తున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా ప్రదానకాలువ నుంచి తూములు ఏర్పాటుచేసి వర్షాధార భూములకు సాగునీరు అందించేదిశగా ప్రభుత్వానికి నివేదికలు పంపారు. పెండింగ్‌లో ఉన్న పందికోన రిజర్వాయర్ పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో మద్దికెర - బురుజుల రహదారిని పూర్తిచేశారు.



'సూపర్ సిక్స్' వరాలు:

తల్లికి వందనం: సూపర్ సిక్స్ పథకాలు అమలులో భాగంగా 'తల్లికి వందనం' పథకం కింద గురువారం తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేయనున్నారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి 10వ తగరతి వరకు చదివే 4.74లక్షల విద్యార్థులకు రూ.715కోట్లు, ఇంటర్మీడియట్ చదువుతున్న 46వేల విద్యార్థులకు రూ.69 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేయనున్నారు.

అన్నదాత సుఖీభవ: 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు రూ.20 వేలు ఆర్థిక సాయం కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ పథకం కింద ఇచ్చే రూ.6వేలతో కలిపి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 2.50 లక్షల రైతు కుటుంబాలకు తొలి విడత కేంద్రం రూ.2 వేలు చొప్పున రూ.50 కోట్లు, రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చే రూ.4,500 చొప్పున రూ.112 కోట్లు రైతు ఖాతాలో జమ చేయబోతున్నారు.

ఒకటో తేదీనే పింఛన్: జిల్లాలో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 2,45,229 మంది ఉన్నారు. 2019ఎన్నికల్లో పింఛన్ రూ.వెయ్యి పెంచుతామని వైసీపీ హామీ ఇచ్చి అధికా రంలోకి వచ్చాక విడతల వారీగా ఐదేళ్లు పెంచారు. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి రూ.వెయ్యి పెంచుతామని హామీ ఇవ్వడమే కాదు.. అధికారం చేపట్టిన నెలలోనే అన్ని రకాల పింఛన్లు రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచారు. వైసీపీ ప్రభుత్వంలో నెలకు రూ.73.50 కోట్లు పింఛన్ పంపిణీ చేస్తే.. టీడీపీ కూటమి రూ.115-120 కోట్లు పంపిణీ చేస్తుంది. నెలనెల రూ.41-45 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతుంది.

పేదల ఇంట దీపం వెలుగు: జిల్లాలో 6.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. దీపం కింద 4.73 లక్షల మంది పేదలు నమోదు చేసుకున్నారు. వీరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందనున్నాయి.

'మార్గదర్శకులు.. బంగారు కుటుంబాలు': జిల్లాలో అత్యంత నిరుపేద కుటుంబాలు 64,166 బంగారు కుటుంబాలుగా గుర్తించారు. 59 మార్గదర్శకులను గుర్తించారు. 64 బంగారు కుటుంబాలకు చేయూత అందించారు.



బడి గంట మోగే వేళ

- పాఠశాల విద్యకు మహర్దశ
- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం





కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనేక నూతన సంస్కరణలు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 1 నుంచి ఇంటర్ వరకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్స్, రెండు జతల యూనిఫాం, షూస్, డిక్షనరీ కలిపి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. జిల్లాకు 12,60,410 పాఠ్య పుస్తకాలు ఇండెంట్ పెట్టగా.. ఇప్పటికే రెండు విడతల్లో 11,85,225 పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. జిల్లా కేంద్రం నుంచి మండల స్థాయికి సరఫరా చేసి మొదటి రోజే విద్యార్థి కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. నోటుపుస్తకాలు 15,35,732, బెల్టులు 1,90,782, ఆక్స్‌ఫర్డ్ డిక్షినరీ 28,458లు, బ్యాగ్స్ 2,69,221, షూస్ 2,71,006 యూనిఫామ్ 2,69,321 జిల్లాకు చేరాయి.

తల్లికి వందనం పథకం డేటా వెరిఫికేషన్ చేస్తున్నాం

తల్లికి వందనం సమర్పించిన డేటా వెరిఫికేషన్ చేస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నగదు ప్రభుత్వం నేరుగా జమ చేస్తుంది. అలాగే మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యం పాఠశాలలకు సరఫరా చేశాం. జూలై 15వ తేదీలోపు కొత్త ఉపాధ్యాయ నియామకం ఉంటుంది. 90 శాతం కిట్లను త్వరలో అందజేయనున్నాం.

- శామ్యూల్ పాల్, డీఈవో

లా సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): లా రెగ్యులర్, సప్లమెంటరీ, స్పెషల్ సప్లమెంటరీ సెమిస్టర్‌ల ఫలితాలను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి వి. వెంకట బసవరావు విడుదల చేశారు. 3, 5 సంవత్సరాల 3,5,7,9 సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- జిల్లాలో 2,294 పనులకు రూ.2014 కోట్లు మంజూరు
- రూ.80 వేల కోట్లతో పోలవరం- బనకచర్ల నిర్మాణం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

కల్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో రూ.678.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, రూ.141 లక్షల రూపాయలతో కర్నూలు-అనుకొండ రోడ్డు నుండి దొడ్డిపాడు వరకు నిర్మించిన తారురోడ్డు, రూ.2250 లక్షల అంచనాతో రెండు వరుసల రహదారిగా వెడల్పు చేసి నిర్మించిన చిన్నటేకూరు-కె. నాగలాపురం-గూడూరు-సి.బెళగల్-ఎమ్మిగనూరు రోడ్ ప్రారంభం, రూ.40 లక్షలతో ఎన్‌హెచ్ 40 నుండి నన్నూరు ఎస్సీ కాలనీ చర్చి వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికే కాకుండా యావత్తు భారతదేశానికే తడకనపల్లె ఒక స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. జిల్లా అభివృద్ధికి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా 10 నెలల కాలంలోనే 2294 పనులు చేపట్టేందుకు రూ.2014 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ.80 వేల కోట్లలతో పోలవరం, బనకచర్ల నిర్మాణం పూర్తి చేస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని అన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ దేశంలో 13 పారిశ్రామిక కేంద్రాలను కేంద్రం గుర్తిస్తే ఓర్వకల్లును ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కలెక్టర్ పి. రంజిత్‌బాషా మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా 2 వేల కోట్లతో పనులు మంజూరు చేయగా అందులో దాదాపు 1600 కోట్లు పాణ్యం నియోజకవర్గంలోని ఈరెండు మండలాల్లో ఉన్నాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో 93 శాతం స్ట్రైక్‌రేటుతో 175 సీట్లకు గాను 164 సీట్లను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కల్లూరు మండల కన్వీనర్ డి. రామాంజనేయులు, తడకనపల్లె సర్పంచు సహారాబీ, జుబేదాబీ, కర్నూలు కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల



పోరాటాలతో పార్టీని బలోపేతం చేద్దాం

- నాయకులు, కార్యకర్తలు, కో ఆర్డినేటర్లకు నిర్దేశం
- అంతా కలిసి పని చేద్దాం- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

వివరాలు 5వ పేజీలో



'తల్లికి వందనం'కు గ్రీన్ సిగ్నల్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గురువారం ఉదయం 11గం టలకు జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 67 లక్షల మంది తల్లుల ఖాతాలోకి తల్లికి వందనం పథకం నిధులు జమ అవుతాయన్నారు. రూ. 8,745 కోట్ల నిధులు పథకానికి కేటాయించారని, ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లల నుంచి ఇంటర్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలవుతుందని పేర్కొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి జేసీఈఈగా రాజశేఖర్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు(జేసీఈఈ)గా రాజశేఖర్ నియమితులయ్యారు. ఏప్రిల్ 30వ తేదీన మునుస్వామి నాయుడు ఈస్థానంలో పదవీ విరమణ పొందగా, అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. ఈనేపథ్యంలో విజయవాడ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న జేసీఈఈ రాజశేఖర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. త్వరలోనే ఈయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇదే కార్యాలయంలో సహాయ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్యాంసుందర్ విజయవాడకు బదిలీకాగా, ఆయన స్థానంలో అక్కడి నుంచి లక్ష్మీనారాయణ కర్నూలుకు బదిలీ అయ్యారు.

హౌసింగ్ ఈఈగా చంద్రశేఖర్: జిల్లా గృహనిర్మాణశాఖ కార్యనిర్వాహక ఇంజనీరుగా పి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. గతనెల 31న వెంకట దాసు పదవీ విరమణ పొందగా ఈ స్థానాన్ని చంద్రశేఖర్‌తో భర్తీ చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు ఈఈగా పని చేస్తున్న చంద్రశేఖర్‌ను ఇక్కడికి బదిలీ చేయగా, మరో రెండురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మార్కెట్ కమిటీ రెగ్యులర్ సెక్రటరీగా జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ కమిటికీ రెగ్యులర్ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా జయలక్ష్మిని నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఈమె అనంతపురం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా పని చేస్తూ కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీగా డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఇక్కడ రెగ్యులర్ సెక్రటరీగా పనిచేస్తున్న గోవిందును అనంతపురం మార్కెట్ కమిటీ రెగ్యులర్ సెక్రటరీగా నియమించారు. ఆదోని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ చంద్రమౌలిని ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ సెక్రటరీగా నియమించారు. అదేవిధంగా ఇద్దరు ఏఎంఎస్‌లు, మరో ఇద్దరు ఏఎంఎస్‌లు, ఏడుగురు సూపర్ వైజర్లు, ముగ్గురు గ్రేడర్లు, ఒక ఎల్‌డీసీని బదిలీ చేస్తూ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖలో ఉమ్మడి జిల్లాలో 60 మంది పశువైద్యులు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, పది మంది వెటర్నరీ అసిస్టెంట్లు, 34 మంది పారా సిబ్బంది, మరో 36 మంది నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేశారు. కర్నూలు పశుసంవర్ధక శాఖ జేడీఏ కార్యాలయంలో మేనేజర్‌గా పని చేస్తున్న జవహర్‌ను అనంతపురం జిల్లాకు, అనంతపురం జిల్లాలో పని చేస్తున్న మంజులను కర్నూలు జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో మేనేజర్‌గా బదిలీ చేశారు. 14 మంది ఏఎస్ వోలను బదిలీ చేశారు.

సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టిన వరద నీరు



సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టిన వరద జలాలు

కొత్తపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువన ఉన్న శ్రీశైలం రిజర్వాయరుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో సప్తనదుల సంగేశ్వర ఆలయం చుట్టూ కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 836 అడుగులకు చేరుకుంది. అలాగే రిజర్వాయరు పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా, 56.2910 టీఎంసీలుగా నమోదైంది. కేవలం ప్రాజెక్టు నీటి మట్టం నాలుగు అడుగులు పెరిగితే సంగమేశ్వర ఆలయంలోని వరదనీరు చేరే అవకాశం ఉంది. ఆలయం చుట్టూ వరద జలాలు వచ్చి చేరుతుండటంతో సంగమేశ్వరం పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి అధికమైంది.

డబ్బులు కొల్లగొట్టడానికే గోదావరి-బనకచర్ల

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ. ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసినట్లు డబ్బాకొట్టుకుం టున్నారని అన్నారు. ఏడాది కాలంలో రైతులకు ఏమి చేశారో చంద్రబాబు నాయుడు చెప్పాలని డిమాండ్‌చేశారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా దెబ్బతిని ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2014-2019 వరకు ఏపీ అంటే ఏ అంటే అమరావతి అని పీ అంటే పోలవరం అన్నట్లుగా చంద్రబాబునాయుడు పని చేశారని గుర్తు చేశారు. 2024లో కూడ అధికారంలోకి వచ్చాక అమరావతి-బానకచర్ల అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా జిల్లాకు వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువల నిర్మాణం ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాసులు, ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, బీసన్న పాల్గొన్నారు.

ఏరువాక వేడుకల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆదోని రూరల్, జూన్ 11 ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో బాలుడు మృతిచెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈరన్న, లక్ష్మి దంపతుల కుమారుడు సురేంద్ర(13) ఎద్దులకు రేకుల షెడ్‌లో రంగులు వేస్తుండగా వర్షం కురిసి, షెడ్‌కు విద్యుత్ తీగలు తగలడంతో బాలుడు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని తప్పించడానికి ప్రయత్నించగా వారు కూడా విద్యుదాఘాతానికి గురికావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసి, బాలుడిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

● ఔదార్యం చాటుకున్న డిప్యూటీ తహసీల్దారు

ఉయ్యాలవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రక్తసంబంధీకులు ఉన్నా అనాథగా మిగిలిన వృద్ధురాలి మృతదేహానికి డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం రూపనగుడిలో చోటు చేసుకుంది. ముసలిగాళ రామక్క (70) కొన్నేళ్లుగా అహోబిళం క్షేత్రంలో భిక్షాటన చేస్తూ జీవించేది. రూపనగుడిలోని ఎస్సీకాలనీలో మేనల్లుళ్లు ఉండటంతో 30 రోజుల కింద గ్రామానికి వచ్చింది. ఆమె బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. ఆమె కుమారులు మద్దూరు గ్రామంలో ఉన్నారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లడం నిరాకరించారు. మృతురాలికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని స్థానికులు డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే స్పందించి తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు చేపట్టారు. గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లను వీఆర్‌ఏలను వెంట తీసుకెళ్లి మృతురాలికి స్థానిక కుందూనదిలో అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు వెంకటలక్ష్మి, దాదాసాహెబ్, దస్తగిరి, హెడ్‌కానిస్టేబుల్ నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీకి అర్హుల జాబితా విడుదల

సీనియారిటీ ఉన్నా కనపడని పలువురి పేర్లు

కర్నూలు హాస్పిటల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ కడప జోన్-4 పరిధిలోని సాధారణ బదిలీల అర్హులైన జాబితాను స్థలాల ఎంపిక వివరాలను కడప రీజనల్ డైరెక్టర్ డా.రామగిడ్డయ్య వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఈ జాబితాలో కర్నూలు జీజీహెచ్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్ పేరు పొందుపరచకపోవడం విశేషం. కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయంలో ఓఅధికారి సీనియారిటీని ఐదేళ్లు ఉంటే కేవలం రెండేళ్లు చూపించారు. ఇక కడప ఆర్‌డీ కార్యాలయంలో కొందరు ఉద్యోగులను జాబితాలో పేర్లు కనబరచలేదు. మరో పక్క ఓ యూనియన్ గుర్తింపు వ్యవహారంపై విచారణ కొనసాగుతుండగా.. దానిపై పూర్తి నివేదిక రాకుండానే ఆ యూనియన్‌ను పరిగణనలోకి తీసుకుని జాబితాలో ప్రస్తావించడంపై కొంత యూనియన్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సమగ్ర విచారణ పూర్తి కాకుండా ఉత్తర్వులు జారీ చేయడం రికాదని కొందరు యూనియన్ నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికే అన్ని క్యాడర్లుకు సంబందించిన ఉద్యోగుల జాబితాను విడుదల చేయడంతో ఎక్కడైనా తప్పులు ఉంటే దాన్ని సరిదిద్దేందుకు రెండు రోజులు గ్రీవెన్స్‌కు అధికారులు సమయం ఇచ్చారు.

కుంటలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

మద్దికెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన ట్రాక్టర్ అదుపు తప్పి మద్దమ్మ కుంటలోకి దూసుకెళ్లింది. వివరాల మేరకు.. బుధవారం ఎరువాక పౌర్ణమి సందర్భంగా యజమాని శేఖర్ ట్రాక్టర్‌ను శుభ్రం చేసేందుకు కుంటలోకి తీసుకెళ్లాడు. అయితే.. లోతు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్ అలాగే దూసుకెళ్లి మునిగి పోయింది. చుట్టుపక్కల వారు వేరే ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



బయటకు లాగుతున్న మరో ట్రాక్టర్

పోరాటాలతో పార్టీని బలోపేతం చేద్దాం

● అంతా కలిసి పని చేద్దాం- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

● నాయకులు, కార్యకర్తలు, కో ఆర్డినేటర్లకు నిర్దేశం



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్, నంద్యాల డీసీసీ జె. లక్ష్మీనరసింహయాదవ్, నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని 7 నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరుకు సంబంధించిన నాయకులు పార్టీలోని సంస్థాగత సమస్యలు, లోపాలను లేవనెత్తారు. డీసీసీ నియామకం లేకపోవడంతో పార్టీలో నాయకత్వ లోపం ఏర్పడిందని, గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని వారు పీసీసీ దృష్టికి తీసుకెళ్లారు. పలువురు కోఆర్డినేటర్లు తమను కలుపుకుని పోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై షర్మిల మాట్లాడుతూ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ చొరవ తీసుకుని పార్టీని మూడు నెలల్లో గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలు, కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక సమస్యలపై పోరాటాలు చేయాలని దిశా నిర్దేశం చేశారు. సమన్వయం లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నట్లు తెలుస్తోందని, ఇకపై అలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందరం కలిసి పని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం మాదిగ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బ్రతుకన్న, బజారన్న, లాజరస్, ప్రమీలమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీడిన మిస్టరీ

● మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు హత్య కేసులో నిందితుల అరెస్టు

● నష్టపరిహారం రాకుండా అడ్డుపడ్డాడని హత్య



నిందితుల అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసాచారి

కర్నూలు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం మీదివేముల మాజీ ఎంపీటీసీ బోయ రమేష్ నాయుడు హత్య కేసు మిస్టరీ వీడింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూములను తమ పేరు మీద లేకుండా చేసి నష్టపరిహారం రాకుండా అడ్డు పడినందుకే కక్ష పెంచుకున్న కొందరు రమేష్ నాయుడును హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. డీఎస్పీ శ్రీనివాసాచారి, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్‌లు బుధవారం రాత్రి కర్నూలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన రాత్రి 10 గంటల ప్రాంతంలో ఓర్వకల్లు మండలం మీదివేముల సమీపంలో రమేష్‌నాయుడు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులు మేడం రామాంజనేయులు, మేడం తిరుపాలు, మేడం శ్రీనివాసులు, మేడం రామకృష్ణలను అరెస్టు చేశారు. హత్యకుగురైన రమేష్‌నాయుడు వైసీపీలో కీలకంగా ఉన్నాడు. గత ప్రభుత్వ హయాంలో ప్రదాన నిందితుడు మేడం రామాంజనేయులు, అతడి బంధువులు ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటూ ఉన్నారు. ఏపీఐఐసీ సంస్థ ఈ ప్రభుత్వ భూములు సేకరించింది. ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్న వారికి నష్టపరిహారం చెల్లించింది. అయితే మేడం రామాంజనేయులు, ఆయన బంధువులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేయకుండా బోయ రమేష్ నాయుడు గ్రామ నాయకుల వైసీపీ నాయకుల అండతో అడ్డుపడ్డాడు. దీంతో ఏపీఐఐసీ సంస్థ ఆ భూములను తీసుకున్నప్పటికీ రామాంజనేయులు వర్గానికి నష్టపరిహారం అందలేదు. దీంతో మేడం రామాంజనేయులు బోయ రమేష్ నాయుడుపై కక్ష పెంచుకున్నాడు.

కాపు కాచి హత్య

ఈ నెల ఐదో తేదీన రమేష్ నాయుడు ఓ పంచాయతీ కోసం కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. పంచాయతీ ముగించుకుని తిరిగి తనస్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. మేడం రామాంజనేయులు, మేడం రామకృష్ణ కూడా కర్నూలు నుంచి మీదివేముల వెళ్తున్నారు. దారిలో ఒంటరిగా వెళ్తున్న రమేష్ నాయుడును గుర్తించారు. అప్పటికప్పుడు ప్లాన్ వేసి మీదివేముల వద్ద కాపు కాచారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రమేష్ నాయుడుపై దాడి చేశారు. బీరు సీసాలతో మొఖంపై కొట్టి, పక్కనే ఉన్న బండరాయితో తలపై మోదీ హత్య చేశారు. ఈ హత్యలో మేడం తిరుపాలు, మేడం శ్రీనివాసులు సహకరించారు. వీరు దరించిన దుస్తులన్నీ పక్కనే కాల్చేసి ఊరికి చేరుకున్నారు. అయితే మేడం రామాంజనేయులు భయంతో అక్కడి నుంచి వెళ్లిపోగా, మిగతా నిందితులు గ్రామంలో ఉన్నారు. మొదట పోలీసులకు వీరిపై అనుమానం రాలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మేడం రామాంజనేయులు హత్య చేసినట్లు గుర్తించి ప్రధాన నిందితులతో పాటు సహకరించిన వారిని అరెస్టు చేశారు. మేడం రామాంజనేయులుకు రమేష్ నాయుడుకు 2015లో గొడవ జరిగింది. ఆ కేసులో కౌంటర్ కేసులు కూడా పెట్టుకున్నారు. అయితే కొద్ది కాలానికి రాజీ అయ్యారు. ఇదిలా ఉండగా ప్రధాన నిందితుడు మేడం తిరుపాలు 1994లో జరిగిన రాముడు హత్య కేసులో 8వ ముద్దాయి. ఆ కేసులో జీవిత ఖైదు పడింది. 2001 నుంచి 2009 వరకు జైలు శిక్ష అనుభవించి క్షమాభిక్షపై బయటకు వచ్చాడు. మరోసారి హత్య కేసులో నిందితుడిగా మారాడు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

● కీలకంగా మారిన సిఫారసులు

● 45 మంది మండల వ్యవసాయాధికారులు, 12 మంది ఏడీఏల ట్రాన్స్‌ఫర్



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన వ్యవసాయ శాఖలో బదిలీల పర్వం కొనసాగింది. పెద్ద ఎత్తున నేతల సిఫారసులు, దండిగా డబ్బులు వెదజల్లిన వారికే కోరుకున్న చోటకు బదిలీలు దక్కాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 45 మంది వ్యవసాయాధికారులు, 12 మంది ఏడీఏలకు కోరుకున్న వారికి కోరుకున్న స్థలాలు దక్కాయి. ఓర్వకల్లు మండల వ్యవసాయాధికారిగా మధుమతి, బండి ఆత్మకూరు ఏవోగా హేమలత, అవుకు ఏవోగా కళాముని, కౌతాళం ఏవోగా విజయజ్యోతి నియమితులయ్యారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన కల్లూరు మండల ఏవోగా విష్ణువర్ధన్ రెడ్డి, ఆదోని ఏవోగా పాపిరెడ్డి నియమితులయ్యారు. ఎమ్మిగనూరు ఏవోగా శివశంకర్, కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి పగిడ్యాలకు, కర్నూలు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పని చేస్తున్న దస్తగిరి రెడ్డి గూడూరుకు బదిలీ అయ్యారు. కౌతాళం ఏవో శేషాద్రి అనంతపురం జిల్లా ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆదోని ఏవో అశోక్ కుమార్‌రెడ్డి జే. బంగ్లా తంగడంచ ఫామ్‌కు బదిలీపై వెళ్లారు. ఓర్వకల్లు ఏవో సుధాకర్ ఎమ్మిగనూరు వ్యవసాయ క్షేత్రానికి బదిలీపై వెళ్లారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఏడీఏలకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు జేడీఏ కార్యాలయానికి పంపారు. నంద్యాల డీఆర్‌సీ ఏడీఏగా పని చేస్తున్న సుధాకర్‌ను కోవెలకుంట్లకు, నంద్యాల ఏడీఏ రాజశేఖర్ కర్నూలు ఆగ్రనమి విభాగానికి, డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డిని ఎమ్మిగనూరు ఎస్‌టీఎల్ విభాగానికి బదిలీ చేశారు. ఆలూరులో పని చేస్తున్న సునీతను డోన్‌కు, ఆదోని ఏడీఏ అరుణకుమారిని కర్నూలు డీఆర్‌సీకి బదిలీ చేశారు. కర్నూలు ఆగ్రనమి విభాగంలో పని చేస్తున్న బాలమద్దిరాజును ఆదోని ఏడీఏగా బదిలీ చేశారు. కర్నూలు డీఆర్‌సీలో పని చేస్తున్న మద్దిలేటిని రాయచోటికి, ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ శైల కుమారిని చిత్తూరు డీఆర్‌సీకి, పలమనేరులో పని చేస్తున్న అన్నపూర్ణను ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు బదిలీ చేశారు. కర్నూలు డీఆర్‌సీలో పని చేస్తున్న గిరీష్‌కు నంద్యాల రెగ్యులర్ ఏడీఏగా దక్కింది.

ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

నంద్యాల, రూరల్ జూన్11(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌ను సేవించి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు, సీఐ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీశైలంలో బుధవారం కర్నూలు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఈగల్ ఎస్ఐ సృజన్‌కుమార్ డ్రగ్స్ వినియోగం- వాటి పర్యవసనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు, సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ డ్రగ్స్ సమస్య నేడు ఓప్రాంతానికో.. ఓరాష్ట్రానికో పరిమితమైన సమస్య కాదన్నారు. చాలా ప్రాంతాల్లో అనేకమంది డ్రగ్స్ వినియోగించి ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండి డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా మెలగాలన్నారు. యువకులు, విద్యార్థులు సైతం నడుం బిగించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌రావు

నేడు మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం

● చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న హరిబాబు



చైర్మన్ గుంటుపల్లి హరిబాబు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నేడు టెక్కె మార్కెట్‌యార్డులో 17వ నంద్యాల మార్కెట్ యార్డు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేశారు. గౌరవ చైర్మన్‌గా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు, వైస్ చైర్మన్‌గా దియ్యాల రంగప్రసాద్‌రావు, సభ్యులుగా భవనాశి ప్రమీలమ్మ, స్వామినాయక్, నంద్యాల విజయగౌరి, నాగలక్ష్మి, అనసూయమ్మ, లీలావతి, నాగమ్మ, మదార్‌సా, సుమలత, రవికుమార్, షేక్ నూర్‌బాష, షేక్‌అజ్మీర్, పీఏసీఎస్ కానాల చైర్మన్, నంద్యాల వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్మన్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున టీడీపీ, కార్యకర్తలు, నాయకులు హాజరుకానున్నారు.

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

● అద్దాలు ధ్వంసం ● ప్రయాణికులకు స్వల్ప గాయాలు

వెల్దుర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఓబస్సు ఢీకొంది. ఈ ఘటన మండలంలోని మదార్‌పురంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. హిందూపూర్ డిపోకి చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాదు నుంచి హిందూపూర్‌కు వెళ్తుంది. అదేసమయంలో తెలంగాణకు చెందిన ఓ లారీ నారాయణపేట నుంచి తమిళనాడులోని తిరుచ్చికి లోడ్‌తో వెళుతోంది. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున మాదార్‌పురం గ్రామ సమీపాన హైవే-44లో ఒకే లేన్‌లో వెళ్తున్న లారీని సూపర్‌లగ్జరీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. బస్సులోని పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. లారీకి ఎలాంటి నష్టం జరగలేదు. హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో వెల్దుర్తి పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రయాణికులను ఆర్టీసీకి చెందిన వేరే బస్సులో తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో తుంగభద్ర రైల్వేస్టేషన్ ఎదురుగా అధాన్ విల్‌మర్ ఫ్యాక్టరీ వెనుకాల ముళ్ల కంప మధ్య గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం గొర్రెల కాపరులు చూసి ఫ్యాక్టరీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద వివరాలు దొరకలేదు. మంగళవారం రాత్రి ఉరేసుకొని ఉండవచ్చని, మృతుడి వయస్సు 35 సంవత్సరాల లోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు బూడిదరంగు జీన్స్, నశ్యం కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడని, తనవెంట తెచ్చుకున్న తెల్లని టవల్‌తో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. కాచాపురం వీఆర్వో పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కోసిగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐరంగల్, పెద్ద భోంపల్లి గ్రామాల మధ్యలో రైల్వే ట్రాక్ పక్కన కల్వర్టు వద్ద అనుమానాస్పద స్థితిలో కర్నూలులోని బుధవారపేటకు చెందిన జగ్గుల మద్దిలేటి (64) మృతిచెందాడు. మంగళవారం రాత్రి తుంగభద్ర రైల్వేస్టేష న్‌లో రైలు దిగి అక్కడి నుంచి పెద్దభోంపల్లి, ఐరంగల్ మధ్యలోని రైల్వేట్రా క్ పక్కనే ఉన్న కల్వర్టు పై నుంచి కిందకు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడని కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం తరలించినట్లు తెలిపారు.

పుట్టాలమ్మ ఆలయంలో చోరీ

● 20 కేజీల వెండి అపహరణ

● సీసీ టీవీ పరికరాలు సైతం ఎత్తుకెళ్లిన దొంగలు

ఆళ్లగడ్డ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): . మండలంలోని పుట్టాలమ్మ క్షేత్రంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి దొంగలు ఆలయ ప్రత్యేక దర్శన ద్వారం తలుపుల తాళాలను పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారు. సుబ్రమణ్యశ్వర స్వామి పుట్టపై అలంకరించిన నాగాభరణం, శఠగోపం తదితర వెండి వస్తువులను చోరీ చేశారు. సీసీ టీవీ పుటేజ్ కేబుల్ వైర్లను తీసి వేసి హార్డ్ డిస్క్‌ను కూడా తీసుకొని పోయారు. ఉదయం ఆలయానికి చేరుకొన్న పూజారి చోరీ జరిగినట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆలయానికి చేరుకొని పరిశీలించారు. జిల్లా కేంద్రం నుండి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.



పుట్టాలమ్మ ఆలయం ఎదుట పోలీసుల విచారణ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



కాడెద్దులతో విత్తనం వేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా హుశేనాపురం గ్రామంలో కాడెద్దులతో పొలం దున్ని విత్తనాలు వేశారు. గ్రామాల్లో రైతులు ఎద్దులను శుభ్రం చేసి అలంకరించి భూమికి పూజలు చేసి దున్నడం మొదలు పెట్టారు. గుట్టపాడు గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి పొలంలో దుక్కులు ప్రారంభించారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

రైతుసంఘం ఆధ్వర్యంలో సంబరాలు



ఉల్చాలలో ఎడ్ల బండ్లపై ర్యాలీగా వెళ్తున్న రైతుసంఘం నాయకులు

కర్నూలు రూరల్ జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు ఎడ్లను అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఎడ్లబండ్లకు రంగురంగులతో ముస్తాబు చేసి పూజలు చేశారు. ఉల్చాల గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొని రైతులతో కలిసి ఎద్దుల బండ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు చేసుకొనే ఏకైక పండుగ ఏరువాక పౌర్ణమి అని ఇది రైతుల పండుగా అని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఈ.తాండ్రపాడు సర్పంచు బాలపీరా, మండల కార్యదర్శి పీబీ పుశేనయ్య, ఇస్మాయిల్, మద్దిలేటి, నాగేష్ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని రైతులు గాడికి ప్రత్యేకపూజలు చేశారు. ఎద్దులను అలంకరించి వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పట్టాభిషేకాన్ని అధికారికంగా నిర్వహించాలి

మంత్రి నిమ్మలకు బలిజ సంఘం నాయకుల విజ్ఞప్తి



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు నగర బలిజ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం అధికారిక పర్యటనలో భాగంగా కర్నూలుకు విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడును నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, ప్రధాన సలహాదారులు గాజుల వెంకట విజయభాస్కర్, సింగంశెట్టి సోమశేఖర్, సుంకర ఆంజనేయులు, ఉపాధ్యక్షులు తుమ్మలశెట్టి ఈశ్వర్‌కుమార్, ప్రకాశ్‌బాబు స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలిసి ఆగస్టు 7న జరగబోయే శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల జాబితాలో చేర్చాలని కోరారు. ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రతి ఏటా ఆగస్టు 7న రాష్ట్ర పండువగా నిర్వహించాలని అభ్యర్థించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సానుకూలమైన ప్రకటన వచ్చేలా చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రికి నగర బలిజ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది ఈ నెల 10నుంచి సమ్మెలోకి వెళ్లారన్నారు. అయినప్పటికి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే పైపులైన్ జంక్షన్ల వద్ద వాల్ తిప్పితే ఏఏ ప్రాంతానికి నీరు వెళ్తాయో అనేది ప్రత్యామ్నా సిబ్బందికి సరైన అవగాహన లేక కాస్త ఇబ్బందిగా ఉంటుందన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండులో సమీపంలోని వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు మాలిక్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు.

● మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు ఇక్బాల్ హుసేన్ డిమాండ్ చేశారు. నగర పాలక కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపారు. నగర కార్యదర్శి ఎస్ ఎండీ షరీఫ్, నాయకులు ఇలియాస్, రియాజ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

వంతెన నిర్మాణానికి భూమి పూజ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం ఉల్చాల-కర్నూలు ప్రధాన రహదారిలో ఉన్న వంతెన నిర్మాణానికి బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 40ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన కాలక్ర మేణ శిథిలావస్థకు చేరి గతేడాది కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిందని తెలిపారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి నిధులు ఇవ్వకపోవడంతో వంతెన నిర్మాణం మరుగున పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం ప్రత్యేక చొరవ తీసుకొని ఉల్చాల వంతెన నిర్మాణానికి దాదాపు 2 కోట్లు నిధులు వెచ్చించి పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉల్చాల నుంచి కర్నూలు వరకు బీటీ రోడ్డు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించినట్లు తెలిపారు. ఉల్చాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య లేకుండా అభివృద్ధి చేసిందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బుర్ర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాములమ్మ, ఎల్లెల్సీ డీసీ వైస్‌చైర్మన్ హనుమంతు, టీడీపీ నాయకులు బీసన్న, శివన్న, చిన్నయ్య, రాఘవేంద్ర, గిడ్డయ్య పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తొలి ఏడాదిలోనే రూ.20 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి చేపట్టామని, రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసి తప్పకుండా మార్క్ చూపుతామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం బైనదొడ్డి గ్రామానికి ఉపాధి నిధులతో రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

ప్రజల ఆదరాభిమానాలు మరువలేను: విష్ణు

కోడుమూరు మండల ప్రజల ఆదరాభిమానాలు మరువలేమని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో కోడుమూరు మండలంలో దాదాపు 3500 మెజార్టీ వచ్చిందని గుర్తు చేశారు. వెన్నుపోటుదారులు పార్టీని ముంచాలని చూశారని, అయితే ప్రజలు తమ వెంట ఉండి నడిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేది, గంగాధర్‌నాయుడు, సురేంద్ర, నాగేష్, రాముడు, పట్టెక్రిష్ణ, రామక్రిష్టారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాముడు, తహసీల్దార్ నాగరాజు, పీఆర్ అధికారులు పాల్గొన్నారు..

సి.బెళగల్: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కేడీసీసీబీ కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి మీదుగా సంగాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరితో కలిసి భూమి పూజ చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కోడుమూరు నియోజకవర్గానికి రూ20.కోట్లు నిధులు మంజూరు చేశా మన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, తిమ్మప్ప, అమర్, హరి, పౌలు, ఎంపీటీసీ ఈరన్నగౌడు, వెంకటేశ్, బాలాజీ వెంకటేశ్, ధనుంజయుడు పాల్గొన్నారు.

గూడూరు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో కుడా నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు వారిని మాజీ ఎంపీపీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన, టీడీపీ నాయకుడు మహేశ్వర రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్, మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సురేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు పాల్గొన్నారు.

రోగుల వివరాలు ఈ-హాస్పిటల్‌లో నమోదు చేయండి: సూపరింటెండెంట్



జనరల్ మెడిసిన్ ఓపీని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల వివరాలను ఈ-హాస్పిటల్ మాడ్యుల్‌లో నమోదు చేయాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు వివిధ విభాగాల హెచ్‌వోడీలను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయన మెడికల్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ ఓపీ విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు రిజిస్ట్రేషన్, ఈ -హాస్పిటల్ మాడ్యుల్ డేటా ఎంట్రీ, వైద్యుల సమయపాలనపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అనంతరం క్యాజువాల్టీలో ఉన్న ఎమర్జెన్సీ విభాగానికి వెళ్లి ఈ-హాస్పిటల్ మాడ్యుల్‌లో ఓపీ, అడ్మిషన్ కేసులు నమోదు అయ్యేలా చూసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ వెంట ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

కేవైసీ చేయించుకోవాలి

కోడుమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం కోసమై ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో రైతులు కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. పట్టణంలోని షణ్ముఖ ట్రేడర్స్, మన గ్రోమోర్ దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేవైసీ చేయించు కున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ డబ్బులు బ్యాంకులో జమ చేస్తామని చెప్పారు. విత్తనాలు తీసుకొన్న అనంతరం బిల్లు ఖచ్చితంగా తీసుకోవాలని అన్నారు. ఇందులో భాగంగా ఆయా దుకాణాల్లోని ఐదు రకాల విత్తన ప్రమాణాలను సేకరించారు. సేకరించిన ప్రమాణాలను పరీక్షల నిమిత్తం అమరావతికి పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గంగమ్మకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోడుమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక సందర్భంగా పట్టణంలోని గంగాభవాని మాతకు గంగపుత్రుల ఆధ్వర్యంలో బుధవారం బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారి బోనాలను తలపై ఉంచుకొని ఊరేగింపుగా గంగాభవాని ఆలయానికి చేరుకున్నారు. బోనాలతో అలంకరించిన పశువులను కూడా ఊరేగింపులో ఊరేగించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అల్పాహారం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలోని ఆడిటోరియంలో బుధవారం బదిలీ కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ జిల్లా శాఖ అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డీఈవో శామ్యూల్ పాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ చిరంజీవి, పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

● అలాగే ఎస్టీయూ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ హాలులో ఉపాధ్యాయుల సౌకర్యార్థమై ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, జనార్దన్‌లను డీఈవో శామ్యూల్ పాల్ అభినందించారు.

‘అశోకా’లో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక దూపాడు శివారులోని అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొ న్నారు. కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు హాజరై ప్రసంగించారు. స్విమ్మింగ్ కేవలం క్రీడ మాత్రమే కాదు.. ఆరో గ్యాన్ని పెంపొందించే సాధనమని అన్నారు. అశోకా ఉమెన్స్ ఇంజనీ రింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ నవీన్, సీఈవో డా.హరీష్ కృష్ణ మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహయ్య ఆచారి, కార్యదర్శి రామకృష్ణ యాదవ్, కోచ్ నటరాజరావు, ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన

గూడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ చిరుధాన్యాల సంస్థ శాస్త్రవేత్త స్వర్ణ రోణంకి చిరుధాన్యాల ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త స్వర్ణ రోణంకి మాట్లాడుతూ ఖరీఫ్‌లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తి గురించి అవగాహన కల్పించారు. కర్నూలు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.సుజాతమ్మ పత్తి, కంది, చిరుధాన్యాల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంపీఈవో సుమతి, ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల పనుల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈ టీ.శేషాద్రి బుధవా రం ఒక ప్రక టనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ పరిధిలో పవర్ కట్ ఉంటుందన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

కర్నూలు హాస్పిటల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వేను వేగవంతం చేయాలని ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.మహేశ్వరప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని ఇంది రమ్మ హౌసెస్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి రోషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్ కోసం దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరలోని చిన్నపార్కు ఎదురుగా ఉన్న ఆర్‌సీఎం ప్రాంగణంలో ఉన్న సెయింట్ మేరీస్ తెలుగు మీడియం పాఠశాలలో మూగ, చెవిటి పిల్లలకు ఒకటి నుంచి 9వ తరగతులకు ఈ నెల 12 నుంచి అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు సమాచారం కోసం 7893999236, 7780317454, 9110329988గల నెంబర్లకు గానీ నేరుగా పాఠశాల కార్యాలయాన్ని గానీ సంప్రదించాలని కోరారు.

కార్మికుల జీతాలు పెంచాలి

● సమ్మెకు వైసీపీ కార్పొరేటర్ల మద్దతు
● గూడూరులో నీళ్ల ట్యాంకు ఎక్కి కార్మికుల నిరసన

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా నగర పాలక కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికు లకు బుధవారం వైసీపీ కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, అర్షియాపర్వీన్, జుబేర్ అహ్మద్, ఎస్‌టీ.షేక్.అహ్మద్, యూనుస్‌బాషా, షాషావలి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో పారిశుధ్య కార్మికులకు జీతంతోపాటు హెల్త్ అలవెన్సు పెంచి రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24 వేలు మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం అవుతున్న కార్మికులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, రాష్ట్ర కోశాధికారి సమీర్‌బాషా, ఉపాధ్యక్షుడు నాగశేషులు, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, యాసిన్‌బేగ్, జ్ఞానమ్మ పాల్గొన్నారు.



నీళ్ల ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న కార్మికులు



కార్మికులకు మద్దతు తెలుపుతున్న వైసీపీ కార్పొరేటర్లు

నీళ్ల ట్యాంకు ఎక్కి కార్మికుల నిరసన

గూడూరు: తమ సమస్యలు పరిష్కరిచాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం గూడూరులో నీళ్ల ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులు మాట్లాడుతూ సమ్మె 36 రోజుకు చేరుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, దూకేశ్వర రావు, బసవరాజు, జయన్న, అంజనేయులు మధు, ఖాజా హుస్సేన్, షబ్బీర్ బాషా పాల్గొన్నారు.

భరతమాత ఆలయంలో జేష్టాభిషేక మహోత్సవం



జేష్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల భరతమాత ఆలయంలో బుధవారం జేష్టాభిషేక మహోత్సవం (108 కలశాలతో వేంకటేశ్వర స్వామి అభిషేకం) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని విష్ణు సహస్రనామ సత్సంగం ఆధ్వర్యంలో భరతమాత దేవాలయ కమిటీ సౌజన్యంతో బుధవారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వారికి 108 కలశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వేద పండితుడు మధుసూదనాచార్యుల పర్యవేక్షణలో అభిషేకంలో పాల్గొన్న జంటల గోత్ర నామాలతో ఈ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భరతమాత ఆలయ కమిటీ అధ్య క్షుడు సందడి మహేశ్వర్, కార్యాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, కోశాధికారి మల్లెల పెద్ద పుల్లారెడ్డి, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తూముకుంట ప్రతాపరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, కొండా శ్రీనివాసులు, లావణ్య, రామసుబ్బమ్మ, వసుంధరమ్మ, లావణ్య, భరద్వాజ శర్మ పాల్గొన్నారు.

లలితా పీఠంలో జేష్ఠ మాస పౌర్ణమి పూజలు: పాతనగరంలోని లలితా సుందరేశ్వర స్వామి దేవాలయం (లలితా పీఠం)లో బుధవారం జేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తొలుత లలితా దేవి అమ్మవారి మూలమూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక శ్రీవట సావిత్రి వ్రతమును ఆచరించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాదం వితరణ చేశారు.

సూపరింటెండెంట్‌కు ఆర్వోగా బాధ్యతలు

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పని చేస్తున్న సూపరింటెండెంట్ వాజిద్‌కు రెవెన్యూ ఆఫీసర్‌గా బాధ్య తలు అప్పగిస్తూ కమిషనర్ రవీంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్యాలయంలో ఇద్దరు రెవెన్యూ ఆఫీసర్లు ఉన్నారు. ప్రస్తుత ఆర్వోకు 19, 20, 21 వార్డులతో పాటు పందిపాడు, లక్ష్మీపురం గ్రామాల 28, 37 వార్డులను అప్పగించారు. ఈ మేర కు నగరంలో పెరుగుతున్న జనాబా, విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని పని విభజన చేసినట్లు తెలుస్తోంది.

స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలు నివారించండి

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేడియో స్టేషన్ ఎదుట కూడలిలో స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను అరికట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు పుల్లారెడ్డి కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్ బాబుకు ఎస్ అన్వర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. కోడుమూరు వరకు కొత్తగా వేసిన రోడ్డు మధ్యలో డివైడర్ ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

సి.బెళగల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మన దొడ్డికి చెందిన జయలక్ష్మిని ఎనిమిది సంవత్సరాల క్రితం కంబంధ హాల్‌కు చెందిన రాముడుతో వివాహం జరిగింది. అయితే జయ లక్ష్మిని భర్త రాముడు నిత్య వేదిస్తున్నాడని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీలకు జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ జైపూర్‌లో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ ఉషూ పోటీల్లో పాల్గొంటున్న కర్నూలు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉషూ మాస్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ స్వగృహంలో క్రీడాకారులను అభినందించి విజయంతో పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం వీరికి ఆర్థిక సాయం అందజేశారు.

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించొద్దు: కాటసాని

ఓర్వకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించొద్దని, ప్రజాప్రతినిధులు పరిపాలనపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని మీదివేముల గ్రామంలో ఇటీవల హత్యకు గురైన బోయ రమేష్ నాయుడు కుటుంబానికి వైసీపీ తరపున రూ.2లక్షల చెక్కును, సొంతంగా రూ.50వేల నగదును మాజీ ఎమ్మెల్యే కాటసాని, వైసీపీ నాయకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. రమేష్ నాయుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చెన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంగన్న, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీటీసీలు పద్మనాభరెడ్డి ప్రవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బడుల్లో విద్యార్థులకు సన్నబియ్యం

ఓర్వకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో భోజనాన్ని అందజేస్తున్నట్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అందించిన సన్నబియ్యాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అందించనున్నారు. కార్యక్రమంలో సీఆ ర్‌పీలు పాల్గొన్నారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్ సెలక్షన్స్


కర్నూలు స్పోర్ట్స్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు బాలికల కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సెలక్షన్స్ జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ అధ్యక్షుడు జి.సురేంద్ర, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 10 మాజీ కార్యదర్శి హర్షవర్ధన్, గిడ్డయ్య పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బిర్లా శ్రీను, వ్యాయా మ అధ్యాపకులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. బుధవారం సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు కృష్ణ అధ్యక్షతన కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు చాంద్‌బాషా, కుమార్, లింగన్న, బాలు, సునీత పాల్గొన్నారు.

ఇక సన్నబియ్యంతో భోజనం

- ఇప్పటికే బియ్యాన్ని పాఠశాలలకు పంపిన ప్రభుత్వం
- విద్యార్థులకు పౌష్టికాహారం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


ఆలూరులో సిద్ధంగా ఉన్న సన్నబియ్యం బస్తాలు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గతంలో మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని పంపిణీ చేసేవారు. గత వైసీపీ హయాంలో నాణ్యత లేని భోజనం తినలేక విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకునేవారు. అయితే టీడీపీ ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యాన్ని సరఫరా చేసింది. బియ్యం ప్యాకెట్లు ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్నాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి బడి తెరిచిన రోజు నుంచే సన్న బియ్యంతో పాటు రుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని ఇవ్వనుంది. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 130 ఉన్నాయి. వీటిలో 30,140 మంది విద్యార్థులు చదువుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీరికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద సన్నబియ్యంతో చేసిన ఆహారాన్ని వడ్డించేందుకు గతేడాది అక్టోబర్‌లోనే తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రాంతాలవారీగా వారు ఇష్టపడే ఆహారాన్ని బట్టి మెనూలో మార్పులు చేశారు. రోజూ మెనూ ప్రకారం గుడ్డు, చిక్కి, రాగిజావాతో పాటు వివిధ రకాల రుచులతో విద్యార్థులకు భోజనం తయారు చేసి వడ్డిస్తారు.

మద్దికెర: మండలంలో 26 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 4వేలకు పైగా చదువు కుంటున్నారు. వారికి నేటినుంచే సన్న బియ్యంతో భోజనం వడ్డించడానికి ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపింది. సన్నబియ్యంతో అన్నం వండేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలూరు: మండలానికి సన్నబియ్యం 25 కేజీల బస్తాలు చేరుకున్నాయి. బియ్యం పక్కదారి పట్టకుండా ట్యాగింగ్ చేశారు. బియ్యం నాణ్యతపై హెచ్ఎంల నుంచి స్టార్ రేటింగ్ రూపంలో అభిప్రాయం స్వీకరిస్తారు. ఆలూరు సివిల్ సప్లై గోదాం నుంచి 140 స్కూళ్లు, 3 కాలేజీలు, 14 సంక్షేమ హాస్టళ్లకు 66 టన్నుల బియ్యంను సరఫరా చేసినట్లు గోదాం ఇన్‌చార్జి శివన్న తెలిపారు.

నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ బడులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు హాస్టళ్లకు 25 కేజీల బస్తాల్లో సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేసింది.

బడులకు చేరుకున్న బియ్యం బస్తాలు

గతంలో 50 కేజీల బియ్యాన్ని గోనెసంచులల్లో ఉంచడంతో పురుగులు మట్టి పెల్లలు ఉండేవి. దీతో ప్రభుత్వం 25 కేజీల బియ్యాన్ని ప్రత్యేకమైన సంచుల్లో పంపడంతో పురుగు పట్టే అవకాశం లేదు. అలాగే బియ్యం పక్కదారి పట్టకుండా అక్రమాలకు తావు లేకుండా క్యూఆర్‌కోడ్‌తో కూడిన ట్యాగ్‌ను కూడా అమర్చారు.

విద్యార్థులకు పౌష్టికాహారం



ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చింది. సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించింది. మొదటి రోజు నుంచే సన్నబియ్యంతో చేసిన ఆహారాన్ని వడ్డిస్తాం.

● శ్రీనివాసులు, ఎంఈవో-2, ఆదోని

నాణ్యమైన భోజనం



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇవ్వనున్నాం. విద్యార్థులు సంతృప్తిగా భోజనం చేసే అవకాశం ఉంది.

● రంగస్వామి, ఎంఈవో, మద్దికెర

పత్తికొండలో 18న మెగా జాబ్‌మేళా

పత్తికొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిగ్రీకళాశాల ఆవరణలో జూన్ 18న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే శ్యాం బాబు పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. 19 నుంచి 35 సంవత్సరాల్లోపు పాల్గొనాలన్నారు. వివరాలను 9603303354, 7981222035, 9346243624 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ ప్రవేశాలు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ హైస్కూల్ కేంద్రం ఇన్‌చార్జి ఫయాజ్ ఉద్దీన్ బుధవారం తెలిపారు. ఒకే ఏడాదిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోవచ్చన్నారు. ఎటువంటి విద్యార్హత లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జూన్ ఆఖరులోపు అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు అన్నారు.

ఆలూరు అభివృద్ధికి సహకరించాలి


కలెక్టర్ రంజిత్ బాషాతో చర్చిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూన్11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. బుధవారం కర్నూలులో కలెక్టర్‌ను కలిశారు. స్పందించిన కలెక్టర్ స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పెండింగ్ ప్రాజెక్టులు వేదవతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడిని కోరినట్లు వీరభద్రగౌడ్ తెలిపారు.

వ్యవసాయాధికారిగా పాపిరెడ్డి


ఏవో పాపిరెడ్డిని సన్మానిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా పాపిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్ కుమార్ రెడ్డిని తంగడంచకు బదిలీ చేశారు. ఎమ్మిగనూరు ఫామ్ ఏవోగా పనిచేస్తున్న పాపిరెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఏఈవో సతీష్ కుమార్ అయ్యన్న, గీల, భారతి, లోకేష్‌రెడ్డి, ఉదయ్ సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందించే పథకాలను అందేలా చూస్తామని, సాగులో మెలకువలు తెగుళ్ల నివారణకు సూచనలు ఇస్తామన్నారు.

లింగ వివక్ష చూపవద్దు


మాట్లాడుతున్న సర్పంచ్ అరుణ్‌కుమార్

దేవనకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు బాలికలపట్ల లింగవివక్ష చూపవద్దని తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, నిరీక్షణ సూచించారు. బుధవారం మండలంలోని తెర్నేకల్‌లో 9వ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరివికాసం నిర్వహించారు. 18 ఏళ్లు నిండాకే బాలికలకు వివాహం చేయాలన్నారు. బాలలకు హక్కులు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీచర్లు మంజుల, చిట్టి, లలిత, సజీవ, పరిమిళ, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


లక్ష్మీనారాయణ

హాలహర్వి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. రైతులను ముబ్బ్యపెట్టి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోనని సూచించారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా క్షయ నివారణ అధికారి భాస్కర్

ఆలూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి భాస్కర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. తరచూ జ్వరం, దగ్గు వస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వమే ఆరు నెలలపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. మందులు సక్రమంగా వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. అనంతరం విశ్రాంత ఎంఈవో రామలింగమ్మ 10 మంది బాధితులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో సత్యవతి, ఆస్పత్రి వైద్యులు వహీద్, రామకృష్ణ, శ్రీకాంత్, టీబీ సూపర్‌వైజర్ గోపాల్ పాల్గొన్నారు.

క్రీడతో మానసిక ఉల్లాసం

మద్దికెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. బుధవారం జడ్పీ బాలుర పాఠశాలలో కేఈ యువసేన నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. విజేతలకు రూ.40వేలు, రన్నర్స్‌కు రూ.20వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్, ఆకుల వేణుగోపాల్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ ఉన్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి పరుగులు

- పత్తికొండలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని ఎమ్మెల్యే శ్యాం బాబు అన్నారు. మండలంలో బుధవారం అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా దూదేకొండలో రూ.78 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికి కొళాయి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం పత్తికొండ మార్కెట్‌యార్డు వెనక దారికి నిర్మించిన సీసీ రహదారి, బైపాస్ సమీపంలోని బృందావన్ కాలనీలో సీసీ రహదారిని ప్రారంబిచారు. సచివాలయం-1లో విజన్ 2047 యాక్షన్‌ప్లాన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరచి అక్రమార్జనే ధ్యేయంగా ఐదేళ్లు పాలించిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం అధికారం చేపట్టిన టీడీపీ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకుసాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. పత్తికొండలో దశాబ్దాలుగా రోడ్లులేని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిం చామని, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఇంటింటికీ కొళాయి పథకం అమలు చేస్తున్నామన్నారు. హంద్రీనీవా ద్వారా 68 చెరువులను నీటితో నింపడంతోపాటు టమోటా జ్యూస్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. వ్యవసాయాభివృద్ధికి హంద్రీ నీవా నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేందుకు ప్రభుత్వానికి పంపేందుకు నివేదికలు సిద్ధంచేస్తున్నామన్నారు. ఆర్డీవో భరత్‌నాయక్, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలినాగేంద్ర, హోటల్ శ్రీనివాసులు, బీటీ గోవిందు, పుండుకూర బ్రహ్మయ్య, తిప్పన్న, దూదేకొండ తిరుమలేష్ గౌడ్, పరమేశ్వర నాయుడు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం-1లో ఎమ్మెల్యే తన ఆధార్‌కార్డును అప్‌డేట్ చేయించుకున్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

- ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి


లైనింగ్ పనులపై అధికారులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే

ఆదోని, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అధికారులను హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని నాగనాథన హళ్లి గ్రామం సమీపంలో చేస్తున్న ఎల్లెల్సీ లైనింగ్ పనులను, తుంగభద్ర బోర్డు అధికారితో కలిసి పరిశీలించారు. రూ.138 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, నాణ్యతలో రాజీపడవద్దని సూచించారు. పూడిక తొలగింపు, కాంక్రీట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలువ 1955లో నిర్మించగా ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగలేద న్నారు. 2021లో అప్పటి సీఎం జగన్ హయాంలో పనులు మంజూరైనా నిధులు కేటాయించకపోవడంతో చేయలేదన్నారు. తాను సీఎం చంద్రబాబు దృష్టికి తీసు కెళ్లానని ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. 15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని ఆదోని నియోజకవర్గంలో కూడా 3.50లక్షల ఎకరాలు ఉన్నాయన్నారు. తూముల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.9కోట్లు మంజూరు చేసిందన్నారు. పెద్ద హరివాణం, మదిరె, చిన్న హరివాణం, సంతేకూడ్లూరు, బసాపురం, మరో ఎనిమిది గ్రామాల పిల్ల కాలువలకు మరమ్మతులు చేయనున్నామన్నారు. బోర్డు డీఈ హుసేన్‌బాషా, ఎల్ఎల్‌సీ సాగునీటి సంఘం అధ్యక్షుడు రామస్వామి, మాజీ కౌన్సిలర్ నాగేంద్ర, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేంద్ర ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ నాగరాజు

ఆస్పరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని డి.కోటకొండ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి బుధ వారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ చిన్నపెండేకల్ గ్రామం నుంచి డి.కోటకొండ వరకు ఐదు కి.మీ.ల రోడ్డుకు రూ.1.20 కోట్లు కేటాయించామ న్నారు. గత వైసీపీ పాలన లో ఆలూరు నియోజక వర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అమలవుతోందన్నారు. మారు మూల గ్రామాల్లో సైతం ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందిస్తామన్నారు. తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, కార్యదర్శి శేషాద్రినాయుడు, మహానంది స్వామి, రంగన్న, మల్లయ్య, ఉరుకుంద, నారాయణ, హనుమంతరెడ్డి, మునిస్వామి, రాజకుమార్ పాల్గొన్నారు.

తల్లికి వందనంతో భరోసా


మాట్లాడుతున్న రవికుమార్

తుగ్గలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంతో పేద విద్యార్థులకు భరోసా వస్తుందని జడ్పీహెచ్ఎస్ విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవి కుమార్, తాలుకా రైతు సంఘం అధ్యక్షుడు బాలన్న అన్నారు. బుధ వారం మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు ఎన్నికల ముందు ఇచ్చిన పథకాల్లో భాగంగా తల్లి ఖాతాకు రూ.15వేలు అందిస్తున్నారన్నారు.

ఏడో రోజుకు చేరిన కార్మికుల దీక్షలు


సంఘీభావం తెలుపుతున్న మాజీ చైర్‌పర్సన్ శాంత

ఆదోని అగ్రికల్చర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం ఏడో రోజుకు చేరాయి. ఐఎఫ్‌టీయూ నాయుకుడు వెంకప్ప, మాజీ చైర్‌పర్సన్ శాంత, ఆమె భర్త సింహం నాగేంద్ర సంఘీభావం ప్రకటించారు. సోమన్న, హమీద్, పీరా, కరెప్ప శివ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ఈశ్వరయ్యస్వామి



ఆలూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా ఈశ్వరయ్యస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సి.బెళగల్ నుంచి ఆలూరుకు బదిలీపై వచ్చారు. విధులు నిర్వహిస్తున్న ప్రకాష్‌నాయుడు ఏడాది క్రితం బదిలీపై వెళ్లడంతో కార్యదర్శి ప్రభాకర్ రావు ఇదివరకు బాధ్యతలు నిర్వర్తించారు.

వెల్దుర్తి ఏఎస్‌వోగా జానకీబాయి

వెల్దుర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి):



అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా జానకీబాయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె క్రిష్ణగిరి మండలం నుంచి వెల్దుర్తికి బదిలీపై వచ్చారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖరవర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేస్తున్న అభిమన్యు కోడుమూరుకు బదిలీ అయ్యారు.

దేవనకొండ తహసీల్దార్‌గా రామాంజినేయులు

దేవనకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):



మండల తహసీల్దార్‌గా కె.రామాంజినేయులు బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. గుడూరు నుంచి ఆయన బదిలీపై దేవనకొండకు వచ్చారు. అక్కడ పనిచేస్తున్న ప్రసాదురాజు పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా తన పూర్వ స్థానానికి బదిలీ అయ్యారు.

రైతులందరికీ విత్తనాలు


విత్తనాలు పంపిణీ చేస్తున్న నబీ సాహెబ్

క్రిష్ణగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ వేరుశనగ విత్తనాలు ఇస్తామని పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీ సాహెబ్‌అన్నారు. ఆలంకొండ గ్రామంలో బుదవారం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలను ఇస్తుందన్నారు. కూర్మగిరి సాగునీటి సంఘం చైర్మన్ బిల్లా వెంకటేశ్వర్లు, బాల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

ఆలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో గురువారం ఆలూరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొనలని కోరారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు


పెద్దతుంబళంలో సబ్ కలెక్టర్‌కు సన్మానం


హొళగుందలో ఎద్దుల పరుగు పోటీలు

ఆదోని రూరల్, జూన్ 11 ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రైతులు ఎరువాక పౌర్ణమి సంబరాలు చేసుకున్నారు. పశువులను శుభ్రం చేసి రంగులు వేసి, పరుగుపందెం నిర్వహించారు. పెద్దతుంబళంలో నిర్వహించిన ఎద్దుల పందేలను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శివరాముడులు వీక్షించారు. అనంతరం గ్రామస్థులు వీరిని సన్మానించారు.

హొళగుంద: ఉదయమే ఎడ్లకు స్నానాలు చేయించి అలంకరించారు. సాయంత్రం డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో రైతుల పండుగ అయిన ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బురుజుల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు. రైతు నారాయణకు చెందిన వృషభాలు విజయం సాధించడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సుబ్బయ్య, రంగస్వామి, జయరాముడు, బాలచంద్ర బహుమతి అందజేశారు.

లో వోల్టేజీతో అవస్థలు

- మద్దికెర సబ్ స్టేషన్ పరిధిలో అంధకారం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



మద్దికెర విద్యుత్ సబ్ స్టేషన్

మద్దికెర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో లో వోల్టేజీ సమస్యతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా ఫీజులు కాలిపోవడం, తీగలు తెగిపోవడంతో తిప్పలు తప్పడం లేదు. గ్రామంలో 5 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేదు. మద్దికెర ఫీడర్‌కు అనుసంధానంగా ఉన్న ఎం.అగ్రహారం గ్రామంలో మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. సాయంత్రం వేళల్లో విద్యుత్ లేకుంటే తమ వ్యాపారాలు ఏం కావాలని చిరు వ్యాపారులు వాపోతున్నారు. లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు నూతన స్తంభాలు పాతిన అధికారులు వాటికి కనెక్షన్లు ఇవ్వలేదు. తాము సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్నా ఇలా ఎందుకు చేస్తున్నారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

- ఈ విషయమై విద్యుత్ ఏఈ మహ్మద్ రఫి మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

ఎమ్మిగనూరు రూరల్ జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, కడివెళ్ల, కందనాతి, కొటేకల్లు, మసీదుపురం, బనవాసి, వెంకటగిరి, మల్కాపురం, కె. తిమ్మాపురం, దైవందిన్నె, ఏనుగుబాల, ఎర్రకోట, కడిమెట్ల, చెన్నాపురం తదితర గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలు, రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో వెలసిన దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పొలాల్లో ప్రత్యేక పూజలు చేసి ఈ ఏడాది పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కాగా సాయంత్రం ఆయా గ్రామాల్లో పరుగుపందెం, ఎద్దుల పరుగు పందె, బండిలాగడం, ఎగరడం వంటి పోటీలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గుడికల్లు గ్రామంలో ఎద్దుల పరుగుపందేల ను చూసేందుకు ఆయా గ్రామాల నుంచి జనం తరలివచ్చారు.

పెద్దకడుబూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతులు పంట పొలాల్లో విత్తనాలను విత్తి పూజలు చేశారు. మండలంలోని దొడ్డిమేకల, చిన్నకడుబూరు, హెచ్. మురవణి, కల్లుకుంట, కంబళదిన్నె, మేకడోన, చిన్నతుంబళం తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో యువకుల పరుగుపందేలు, ఎద్దుల పరుగుపందేలు చూపరులను ఆకట్టుకున్నాయి.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే రైతులు తమ వృషభాలకు పూలతో అలంకరించారు. దేవాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ చావిడిల దగ్గర తోరణాలు తెంపే పందెం పోటీలు నిర్వహించారు. వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి వృషభాలకు ప్రత్యేకపూజలు చేశారు. పారువేట ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ విజయభాస్కర్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

నందవరం: మండలంలోని ముగతి, నాగలదిన్నె తదితర గ్రామాల్లో బుధవారం ఘనంగా ఏరువాక పండుగ ఉత్సవాలు జరిగాయి. ఉదయం రైతులు ఎద్దులకు పూజలు నిర్వహించారు. అనంతరం పొలాల్లో పూజలు చేసి పనులు ప్రారంభించారు. సాయంత్రం రైతులు ఎద్దులను ఊరేగించారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగితో పాటు పల్లెపాడు, చింతకుంట, డి.బెళగల్ గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు, ప్రజలు పండుగను ఘనంగా నిర్వహించారు. కోసిగిలో రైతులు వృషభాలను ముస్తాబు చేసి గ్రామ పురవీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం సాయంత్రం కోసిగిలోని మూడు చోట్ల ఎద్దులకు పారువేట నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ హనుమంతరెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరుగు పందెం విజేత చింతలగేని నరసింహులు : కోసిగిలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం మొదటి రోజు నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో కోసిగి 4వ వార్డుకు చెందిన చింతలగేని నరసింహులు మొదటి విజేతగా నిలిచాడు. పోటీలను తిలకించేందుకు కోసిగి నుంచి ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, ఎమ్మిగనూరు ఎస్ఐ మాధవరెడ్డి, పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మంత్రాలయం: మండలంలోని సూగూరు, చెట్నహళ్లి, మంత్రాలయం, మాలపల్లి, సుంకేశ్వరి, సింగరాజనహళ్లి, రాంపురం ఖగ్గల్లు, నారాయణపురం గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంత్రాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, పూజారి వ్యాసరాజాచార్, టీడీపీ నాయకులు అశోక్‌రెడ్డి, వరదరాజులు నిర్వహించిన ఎద్దుల పారువేటలో శ్రీమఠం గోశాలకు చెందిన వృషభం విజయం సాధించింది. గతేడాది, ఈయేడాది వరుసగా విజయం సాధి ంచడంపై ఆ వృషభానికి పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగిం చారు. గోశాల సిబ్బందిని మఠం అధికారులు అభినందించారు. వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, గోరుకల్లు కృష్ణ, రామాం జనేయులు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.


నందవరం మండలం నాగలదిన్నెలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతు


కోసిగిలో ఎద్దులను ఊరేగిస్తున్న ప్రజలు


మంత్రాలయం పారువేటలో శ్రీమఠం వృషభాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


గోనెగండ్లలో ఎద్దులకు పూజలు చేస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి


బాపులదొడ్డి బస్టాండు వద్ద పరుగు పందెం పోటీలకు సిద్ధంగా ఉన్న కోసిగి యువకులు

సకాలంలో పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నరేష్ బాబు

గోనెగండ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో బ్యాంక్‌లో తీసుకున్న క్రాప్‌లోన్‌లను రెన్యువల్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నరేష్‌బాబు కోరారు. బుధవారం గోనెగండ్లలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఆవరణలో రైతులకు వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ నరేష్‌బాబు మాట్లాడుతూ ఖాతాదారులు ఓటీఎస్‌ద్వారా వీలైనంత త్వరగా సెటిల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. పీఎంజేజేబీవై రూ. 436 కే రూ. 2లక్షల బీమా, పీఎంకే ఎస్బీవై రూ. 20లకే రూ. 2లక్షల బీమా సౌకర్యం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రమాద బీమా పాలసీ ఏడాదికి రూ. 2వేలు రోజుకు రూ. 6లతో రూ. 40లక్షల బీమా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శివశంకర్, సద్దాం, ఉమర్, అక్బర్, బ్యాంక్ బీసీలు ప్రతాప్, నరసన్న, మాజీ సర్పంచ్ రహంతుల్లా, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మిగనూరు నుంచి పాదయాత్ర



ఎమ్మిగనూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట ఎమ్మిగనూరు పట్టణం నుంచి గుడికల్ గ్రామం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమై గుడికల్ గ్రామం వరకు సాగునుందని పేర్కొన్నారు. పాదయాత్రకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

గోనెగండ్ల డీటీగా రఘువీర



గోనెగండ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్‌గా రఘువీర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న విష్ణుప్రసాద్ కల్లూరుకు బదిలీపై వెళ్లారు. పత్తికొండ నుంచి రఘువీర గోనెగండ్లకు బదిలీపై వచ్చారు.

టీడీపీకి పతనం తప్పదు

● వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి

గోనెగండ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు రెడ్‌బుక్ పేరుతో అధికారులను, ప్రజలను బెదిరిస్తున్నారని ఇక ఆ పార్టీకి పతనం తప్పదని మాజీ ఎంపీపీ, వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గోనెగండ్లలో వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కాశీరెడ్డి, మాజీ కన్వీనర్ దొరబాబు, నాయకులు వెంకటరామిరెడ్డి, మురళీనాయుడు, మన్సూర్, భాస్కర్‌రెడ్డి, గోవిందు, అరుణమ్మ, పేట అల్లాబకాష్, ఉల్చాల రంగన్ననాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు,జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ పట్టణ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణ నాయకులు మద్దిలేటి, దామా నరసింహులు, నవాజ్, గిరి, శాలేమ్, గోనెగండ్ల రంగముని, రంగస్వామి నాయుడు మాట్లాడారు. కురువ కులస్తులకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇస్తే కొందరు ఇబ్బంది పడుతున్నారన్నారు. 1969నుంచి ఇప్పటివరకు మార్కెట్ యార్డ్‌కు బీసీలు ఎవరు చైర్మన్‌గా ఎంపిక కాలేదన్నారు. అయితే మొదటిసారిగా బీసీలకు చైర్మన్‌గిరి ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిదేనన్నారు. నందవరం మండలానికి చెందిన మాధవరావు దేశాయ్ బీసీలను చిన్నచూపు చూస్తూ మాట్లాడం సరికాదన్నారు. పార్టీలో ఉంటు వెన్నుపోటు పొడిచే వారికి స్థానం ఉండదని ఈవిషయన్ని తెలుసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు దావీదు, డబ్బాఈరన్న, నరసింహులులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే ఊరుకునేది లేదు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్రరెడ్డి


లక్ష్మయ్యను పరామర్శిస్తున్న ఇన్‌చార్జి రాఘువేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల్లో ఇంకా మార్పు రాలేదని, దాడులు జరిగితే ఊరుకునేది లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి హెచ్చరించారు. బుధవారం మాలపల్లి గ్రామంలో మాజీ జడ్పీటీసీ, టీడీపీ జిల్లా నాయకుడు ఆర్. లక్ష్మయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు కులాల పేరుతో రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. లక్ష్మయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికి ఎవరు వచ్చినా వదిలే ప్రసక్తే లేదన్నారు. రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగితే ఏవేవో ఊహించుకుని కేసులు పెట్టడం దారుణమన్నారు. పల్లెపాడు నాయకులు రామిరెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోండి

● ఈ నెల 20 వరకు అవకాశం : ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివెళ్ల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 6,7,8,9వ తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ ఫారాన్ని పాఠశాలలో సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకునేందుకు ఈనెల 20 చివరితేదీ అని తెలిపారు.

గుడికల్లులో ఏరువాక సంబరాలు

ఎమ్మిగనూరు రూరల్: గుడికల్లు పేరు వినగానే వింతలు.. విశేషాలే ముందుగా అందరికి గుర్తుకు వస్తాయి. ఏ పండుగ జరిగినా ఈ గ్రామంలో ఏదో ఒక ప్రత్యేకత ఉండే ఉంటుంది. దసరా రోజు చేసే యువకుల వేషధారణల గురించి చెప్పనక్కనరలేదు. వీపులకు మేకులను గుచ్చుకొని ఎద్దుల బండి చక్రాలను, వాహనాలను లాగడం, ట్యూబ్‌లైట్లపై వాహనాలతో దూసుకెళ్లడం వంటి చాలా విన్యాసాలు చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంటాయి. సినిమాల్లో తలపించే విన్యాసాలు చేయడంలో ఈ గ్రామంలోని యువకులు ఏ మాత్రం తగ్గరడనంలో ఆశ్చర్యంలేదు. అందులో భాగంగానే ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం గ్రామంలోని యువకులు సై సినిమాలో మాదిరిగా దున్నపోతుతో ఊరేగింపు చేసి అందరిని ఆకట్టుకున్నారు. అలాగే మరికొంతమంది యువకులు ఎన్టీఆర్, రామ్‌చరణ్, పవన్‌కళ్యాణ్, అల్లుఅర్జున్ లతో పాటు వివిధ వేషాధారణల్లో యువకులు ఊరేగింపు చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు.


సై సినిమాలోని విలన్ వేషధారణలో యువకుడు వెంకట్, విచిత్ర వేషధారణలో యువకుడు


సై సినిమాలోని ఆటగాళ్ల వేషధారణలో చిన్నారులు, యువకులు

రూ.2.60కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం


భూమి పూజ చేస్తున్న రాఘువేంద్రరెడ్డి

పెద్దకడుబూరు జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.2.60కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని మంత్రాల యం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగలదొడ్డి రోడ్డు కోసం రూ.1.25కోట్లు, మేకడోన నుంచి కల్లుకుంట వరకు 1.35లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నరవరమాకాంతరెడ్డి, బసలదొడ్డి ఈరన్న, కోసిగి ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, వక్రాని వెంకటేష్, నాడిగేని అయ్యన్న, చింతనగేరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

కోసిగి: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటం వల్ల అభివృద్ధి దూసుకుపోతుందని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో రూ. 1.25 కోటితో బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే చిర్తనకల్ క్రాస్ నుంచి మూగలదొడ్డి గ్రామం వరకు రూ.1.25 కోటితో బీటీ రోడ్లకు భూమి పూజ చేశామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సూపర్ సిక్స్ హామీలతో పాటు చెప్పని హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, రామకృష్ణ, తాయన్న, జనసేన నాయకులు చింతలగేని వీరారెడ్డి, మూగలదొడ్డి వీరారెడ్డి కృష్ణారెడ్డి, చంద్రాస్, వెంకటేశ్, మాలపల్లి లక్ష్మన్న తదితరులున్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు రూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గురుకుల మహిళా కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీర్వాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో కామర్స్, మ్యాథమెటిక్స్ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు తమ దరఖాస్తులు అందజేయాలన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ చేసి 55శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాబాఫరీద్ ఉరుసు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిరాలదొడ్డి క్రాస్‌రోడ్డులో వెలసిన బాబాఫరీద్ ఉరుసు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తెల్లవారు జామునుంచే దర్గా నిర్వాహకులు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి దర్గాను సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఆయా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి మధురైకు చెందిన శరవన్ అనే భక్తుడు రూ.లక్ష , బెంగళూరుకు చెందిన మరో భక్తుడు శివకుమార్ రూ. లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్‌కోణాపూర్ తెలిపారు. బుధవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబాలకు శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

పట్టుబడిన కర్ణాటక మద్యం ధ్వంసం

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1175 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాని విలువ సుమారు రూ. 5,24,600 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌రెడ్డి, ఎస్సై ఇస్మాయిల్, గోపాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

గళ్ల పరీక్షలు చేయించుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలకు మించి జ్వరం, దగ్గు ఉంటే గళ్ల పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జాహ్నవి సూచించారు. బుధవారం 16వ వార్డులోని దేబీఘాట్‌లో కౌన్సిలర్ వాహిద్ అధ్యక్షతన క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలను వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. సమావేశంలో టీబీ సూపర్‌వైజర్ సుమలత, ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

●35వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు పట్టణంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 35వ రోజుకు చేరాయి. యూనియన్ అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ ఏళ్లగా ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ భాగాల్లో పని చేస్తూ చాలీచాలని జీతాలతో జీవనం నెట్టుకొస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, 15సంవత్సరాల సర్వీస్ కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుడికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంకటేశులు, నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్ కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, బాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల ధిక్కరణ

● స్టే ఇచ్చిన ఇంటి స్థలాల్లో పనులు ● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


హైకోర్టు స్టే ఇచ్చిన స్థలంలో ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న పనులు

మంత్రాలయం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేసి ఎక్స్‌కవేటర్‌తో యథేచ్ఛగా పనులు చేపట్టారు. దీంతో కోర్టుకు వెళ్లిన ఫిర్యాదుదారులు అడ్డుకున్నారు. బుధవారం ఫైబావి అనిత, ఫైబావి పరిమళ, మరి కొంత లబ్ధిదారులకు పదిహేనేళ్ల క్రితం 238 సర్వేనెంబరులో పట్టాలు ఇచ్చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఇతరులకు పట్టాలు ఇవ్వడంపై అదే గ్రామానికి చెందిన మహిళా లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించి 2022లో స్టేటస్‌కో ఆదేశాలు పొందారు. అయితే కొంత మంది హైకోర్టు ఆదేశాలు బేఖాతరు చేసి స్థలాలను ఆక్రమించకుని చదును చేసే ప్రయత్నం చేశారు. బాధితులు మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. తమకు సంబంధం లేదని, రెవెన్యూ అధికారులను కలవాలని సూచించారు. బాధితులు తహసీల్దార్ ఎస్.రవిని ఆశ్రయించడంతో గ్రామ వీఆర్వో నరసప్ప, ఆర్ఐ జనార్దన్‌లు స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత స్థలంలో పనులు చేపట్టకూడదని, చదును చేస్తున్న పనులు నిలుపుదల చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. హైకోర్టు ఆదేశాలను పాటించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ రవి చెప్పారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై విహరించారు. బుధవారం పౌర్ణమి శుభది నాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబు టధేంద్ర తీర్థుల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయి ద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి పాటుపడదాం

కౌతాళం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి పాటుపడాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుడికంబాలి ఆనంద్ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం మండల అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. మంత్రాలయం నియోజవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బండారి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దళిత మండలంలో దళితుల అభివృద్ధికి ఎన్నో పోరాటాలు చేసి వారి హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ ఎన్నో ఉద్యమాలు చేసిందని, వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముగతి ప్రతాప్, రాజబాబు, వీరేష్, గాబ్రియేల్, కామవరం తిమోతి, లింగాలదిన్నె నాగరాజు, వల్లూరు అనుమేష్ పాల్గొన్నారు.